ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 9 ఆగస్టు 2024

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశా లలు, వసతిసౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థు లు అర్హులన్నారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండా లన్నారు. సెప్టెంబరు 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబరు 8వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు.

అడవి బిడ్డలు.. ఆ ఐదేళ్లు..!

- కనీస సదుపాయాలకు నోచుకోని వైనం
- రోడ్లు, విద్యుత్ సౌకర్యంలేని గూడేలెన్నో?
- అందని ద్రాక్షగా విద్య, వైద్యం
- అత్యవసరమైతే డోలీల మోత
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- గిరిజనుల పట్ల అప్పటి పాలకుల నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపైనే ఎన్నో ఆశలు
- ఇటీవల ఆశాఖ మంత్రితో సీఎం సమీక్ష



సుదూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్న చింతలగూడ గిరిజనులు (ఫైల్)

గత వైసీపీ పాలనలో అడవి బిడ్డలు నరకం చూశారు. ఐదేళ్ల పాటు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. విద్య, వైద్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. రోడ్లు లేక రాళ్లూ, రప్పలపై నడిచారు. తాగునీటి కోసం ఎత్తయిన కొండలు దిగేవారు. జబ్బు చేస్తే వైద్యం అందక ఎందరో ప్రాణాలు కోల్పోయేవారు. అత్యవసర వేళల్లో రోగులను డోలీల్లో మోసుకుంటూ, కొండలు, వాగులు దాటుకుంటూ వైద్యశాలలకు తరలించేవారు. విద్యుత్ లేక చీకట్లో మగ్గారు. కనీసం తాగునీరు, రోడ్డు మార్గం లేని గూడేలెన్నో ఉన్నాయి. 108, 104 వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితులను మార్చేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. గిరిపుత్రుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. ఇటీవల గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో సమీక్ష నిర్వహించారు. గిరిజనుల కష్టాలు తీర్చేందుకు బృహోత్తర కార్యక్రమాలు అమలు చేసేందుకు అడుగులు వేస్తోన్నారు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి/సీతంపేట రూరల్)

జిల్లాలో పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 1,87,829 మంది, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 35,182 మంది గిరిజనులు ఉన్నారు. మైదాన ప్రాంతాల్లో మరో 37,408 మంది గిరిజనులు ఉన్నారు. వీరిలో కొండదొర, సవర, గదబ, ఎరుకుల, మోకుదొర, మన్యందొర, భగత, కోయ, వాల్మీకి, జాతాపు తదితర జాతులు ఉన్నాయి. వీరి ప్రధానమైన భాష సవర. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గతంలో వీరి అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో పథకాలను జగన్ సర్కారు ఆపేసింది. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను ఎత్తివేసింది. ట్రైకార్, తదితర రుణాలు మంజూరు చేయలేదు. వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందించలేదు. గర్భిణి వసతి గృహాలను నిర్వీర్యం చేసింది. అందులో పనిచేసే సిబ్బందికి ఏళ్లుగా జీతాలు చెల్లించలేదు. వైటీసీలను ప్రభుత్వ కార్యాలయాలుగా మార్చేసి యువతను శిక్షణకు దూరం చేసింది. జీపీఎస్ పాఠశాలలను ఎత్తేసింది. గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత 50 శాతం దాటని పరిస్థితి ఉంది. దీనివల్ల అనేక మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మారిపోతున్నారు. గిరిజన ఉత్పత్తులు చింతపండు, కొండచీపుర్లు, పనస, పైనాపిల్, సీతాఫలం, కందులు, మినుములు, పెసలు, ఉలవలు, బొబ్బర్లు, రాగులు తదితర పంటలకు కనీసం గిట్టుబాటు ధర కల్పించలేదు. దీంతో దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోయేవారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో వందలాది గిరిజన గ్రామాలు నాన్‌షెడ్యూల్ గ్రామాలుగానే కొనసాగుతున్నాయి. షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలని గిరిజనులు కోరుతున్నప్పటికీ నేటికీ వారి కోరిక నెరవేరడం లేదు. ఇలా వైసీపీ ఐదేళ్ల కాలంలో ఆదివాసీ బిడ్డలకు తీవ్ర అన్యాయం జరిగింది.



సీతంపేట మల్లమ్మగూడలో రోగిని డోలీలో మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

గిరిజనుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గిరి శిఖర గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రాంతాల్లో మినీ పీహెచ్‌సీలు వంటివి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు జీసీసీని బలోపేతం చేసే దిశగా సంస్కరణలు తీసుకువస్తున్నారు. ఎత్తయిన కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణం చేపట్టడంతో పాటు సెల్ టవర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో నిలిచిపోయిన ట్రైకార్ రుణాలు మంజూరు చేయనున్నారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం సీతంపేటలో ఉన్న 30 పడకల ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా మార్పు చేస్తూ రూ.20కోట్లు మంజూరు చేసింది. వైసీపీ హయాంలో నిలిచిన ఈ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈ పనులు పూర్తయితే సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం, మందస, హిరమండలం ప్రాంతాల్లోని గిరిజనులకు వైద్యసేవలు అందనున్నాయి.



రంగంవలసకు వెళ్లేందుకు ఈ రాళ్ల దారే గతి..

వైసీపీ ప్రభుత్వం రుణం అందించ లేదు..



గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఐటీడీఏ ద్వారా ట్రైకార్ నిధులు రూ.6.5లక్షలతో నాకు ట్రాక్టర్ మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్ ద్వారా ఆర్థికంగా స్థిరపడ్డాను. సొంత పొలం సాగు చేసుకో వడంతో పాటు ట్రాక్టర్‌ను అద్దెకు తిప్పుకొని లాభపడ్డాను. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు ఐటీడీఏ చుట్టూ తిరిగినా ఒక్క రుణ సహాయం కూడా అందలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో మాకు ఎంతో మేలు జరుగుతుందనే నమ్మకం ఉంది.

-బిడ్డిక చంద్రరావు, శిలగాం, సీతంపేట

ఆనందంగా ఉంది..



కూటమి ప్రభుత్వం రావడం ఆనందంగా ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ట్రైకార్ పథకం ద్వారా నాకు రూ.2లక్షల రుణం అందింది. అప్పటి నుంచి కొండ చీపుర్ల వ్యాపారం చేస్తున్నా. దీనివల్ల ఆర్థికంగా నిలదొక్కుకున్నా. సొంతింటి కలను నిజం చేసుకున్నా. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుణ సహాయం కోసం ఐటీడీఏను ఆశ్రయిస్తా.

-సవర మహేష్, అయ్యప్పగూడ, సీతంపేట

డోలీల మోత లేకుండా చర్యలు..



వైసీపీ పాలనలో గిరిజన ప్రజలు కనీస మౌలిక సదుపాయాలకు దూరమయ్యారు. వచ్చే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాటికి గిరిజన ప్రాంతాల్లో డోలీల మాట వినబడకుండా చేస్తాం. ఫీడర్ అంబులెన్స్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో పాటు గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. రూ.3 కోట్లు మంజూరు చేయించి పలు గిరిజన గ్రామాలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాం. మిగిలిన గ్రామాల్లో కూడా తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తాం.

-గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన, శిశుసంక్షేమ శాఖ మంత్రి

యువ ఐఏఎస్‌లకు ప్రయోగశాలగా పార్వతీపురం ఐటీడీఏ..

గుమ్మలక్ష్మీపురం: ఉమ్మడి జిల్లాలో గిరిజన ప్రాంత అభివృద్ధికి 1983లో పార్వతీపురంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను ఏర్పాటు చేశారు. నాటి నుంచీ ఈ ఐటీడీఏ యువ ఐఏఎస్ అధికారులకు ప్రయోగ శాలగా మారింది. వారు ఇక్కడకు ప్రాజెక్టు అధికారులుగా రావడం, వారి ఆలోచన బట్టి అభివృద్ధి పనులు చేయడం సాధారణమైపోయింది. 1983లో పీవోగా వచ్చిన చెల్లప్ప గిరిజన విద్యకు, వస్తువుల కల్పనకు, ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు. 1987లో ఎల్‌వీ సు బ్రహ్మణ్యం పీవోగా వచ్చారు. ఆయన సాగునీటి బావుల తవ్వకాలు చేపట్టారు. విద్యపై కూడా ఆసక్తి కనబరిచి 356 మంది ఏకో ఉపాధ్యాయులను నియమించారు. 1992లో పీవోగా వచ్చిన డి.జగన్నాథరావు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, మహిళా గ్రూప్‌ల ఏర్పాటు, సొసైటీలు, విలేజ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఇంజనీరింగ్ పనులు చేశారు. ఈయన బదిలీ తర్వాత పీవోగా వచ్చిన పొన్నవలు గిరిజన ప్రాంతంలో కుటీర పరిశ్రమల ఏర్పాటు, సెరికల్చర్ ద్వారా పట్టు పరిశ్రమ, ఐప్యాడ్ వంటి పథకాలతో పెద్ద ఎత్తున జీడి తోట్ల పెంపకాన్ని చేపట్టారు. ఈ పథకం పూర్తిస్థాయిలో విజయవంతమై ప్రస్తుతం సుమారు 65 వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఇవి గిరిజన ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. 1997లో పీవోగా పని చేసిన సంజయ్‌జాజు తన మార్క్ పథకాలు అమలు చేయకుండా పాత పథకాలనే కొనసాగించారు. ఈయన తరువాత పీవోలుగా వచ్చిన పండదర్శన, లక్ష్మీషా కొండ శిఖర గ్రామాలకు రహదారుల నిర్మాణానికి, టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐటీడీఏకు నిధుల కొరత ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో అంబేడ్కర్, కూర్మనాథ్, విష్ణుచరణ్ పీవోలుగా పనిచేశారు. వీరి హయాంలో నిధుల కొరత కారణంగా ఏ మాత్రం అభివృది జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజన అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని గిరిజనులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

1,580 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి) ఆగస్టు 8: జిల్లాలో 1,598 పాఠశాలలకు గాను 1,580 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తవగా, 18 పాఠశాలల్లో వాయిదా పడ్డాయి. కోరం లేక బలిజిపేట మండలంలో 9 పాఠశాలల్లో, భామిని మండలంలో 2, సీతానగరం 3, వీరఘట్టం మండలంలో ఒక పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. తల్లిదండ్రులు హాజరుకాకపోవడంతో జియ్యమ్మవలస మండలంలో రెండు పాఠశాలల్లో, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడంతో కురుపాం మండలంలోని ఒక పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. కాగా, ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలకు చెందిన నాయకులు పైచేయి సాధించేందుకు ఆరాటపడ్డారు. కొన్ని పాఠశాలల్లో తెలుగుతమ్ముళ్ల మధ్య నువ్వా నేనా అన్న విధంగా వాదోపవాదనలు జరిగాయి. వారికి ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సర్దిచెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు కావడంతో కొంతమంది టీడీపీ స్థానిక నాయకులు అత్యుత్సాహం చూపించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరు తమదే పై చేయిగా ఉండాలని ఎస్ఎంసీ ఎన్నికల్లో మొండిగా వ్యవహరించడం టీడీపీ మండల అధ్యక్షులకు తలనొప్పిగా మారింది.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

- సారా, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోండి: ఎస్పీ

భామిని/సీతంపేట/రూరల్/జియ్యమ్మవలస, ఆగస్టు 8: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. గురువారం బత్తిలి, దోనుబాయి, జియ్యమ్మవలస, చిన మేరంగి పోలీసు స్టేషన్లతో పాటు బత్తిలి చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణాపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని ఆదేశించారు. సారా, గంజాయి, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. నేరాల నియంత్రణ కోసం పని చేయాలని, పెండింగ్ ఫైళ్లను పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. యువత చెడు మార్గాల్లో పయనించకుండా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సారా నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ఈయన వెంట పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐలు బి.మంగరాజు, చంద్రమౌళి, ఎస్ఐలు సీహెచ్ ప్రసాద్, పి.అనీష్, ఇ.చిన్నంనాయుడు, అనీల్‌కుమార్, తదితరులు ఉన్నారు.



భామిని చెక్‌పోస్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ముందస్తు వేడుకలు

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముందస్తుగా గురువారం ఆదివాసీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీపురం ఐటీడీఏలోని అడవి తల్లి విగ్రహం వద్ద ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పీవో సేధు మాధవన్ థింసా నృత్యం చేశారు.



థింసా నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, ఐటీడీఏ పీవో సేధు మాధవన్

నేడు ఆదివాసీల పండగ

- గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించేందుకు సన్నద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరిశీలించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి)/ సీతంపేట, ఆగస్టు 8: ఆదివాసీల పండగకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనుల సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా జరిగే వేడుకలు కావడంతో అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆదివాసీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భోజనం, వాహన సౌకర్యాలు, ఆదివాసీ దుస్తులు కల్పించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆదివాసీలు తమ ఇళ్లల్లో కొత్త బట్టలు ధరించి పిండి వంటలు చేసుకొని ఆస్వాదిస్తారు. సీతంపేట ఐటీడీఏ వద్ద ఉన్న అడవి తల్లిని కొత్త బట్టలు, నాటుకోడి, వేపకొమ్మలు, పసుపు కుంకుమ, కొత్త బుట్ట, చిన్నపాటి పందిరి వేసి అలంకరిస్తారు. అన్ని ప్రాంతాల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి డప్పు వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తారు. తద్వారా ఈ ఏడాది అంతా శుభం జరుగుతుందని వారి నమ్మకం.



సీతంపేట ఐటీడీఏ వద్ద అడవితల్లి విగ్రహం

పక్కా ఏర్పాట్లు చేయండి..

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఆదివాసీ పండగకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు మైదానంలో చేస్తున్న ఏర్పాట్లను గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నృత్యాలు, శకటాల ప్రదర్శన నిర్వహించాలన్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసే ప్రదర్శన శాలలు అందరినీ అవగాహన, ఆలోచింపచేసే విధంగా ఉండాలన్నారు. వేడుకల్లో పాల్గొనేవారికి నాణ్యమైన భోజనాలు అందించాలన్నారు. వర్షం పడినా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ప్రూఫ్ పరదాలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అతిథుల సందేశాలు, గిరిజన పెద్దలకు సత్కారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, ఐటీడీఏ పీవో ఎస్.సేధు మాధవన్, ఆర్డీవో కె.హేమలత, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఎస్.శాంతీశ్వరరావు, రోడ్లు భవనాలశాఖ, ఇంజనీరింగ్ అధికారి ఎం.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరిని వరిస్తాయో?

- త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ
- టీడీపీ ఆశావహుల్లో టెన్షన్
- జనసేన, బీజేపీ నేతల్లో కూడా..

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)



కూటమి ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పదవులను కేటాయిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతుంది. విడతల వారీగా నామినేటెడ్ పదవులకు నాయకులను ఎంపిక చేస్తారని, దీనిపై కసరత్తు దాదాపు పూర్తి చేసినట్టు సమాచారం. దీంతో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారిలో టెన్షన్ మొదలైంది. ఎవరికి దక్కుతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నుంచి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన నాయకులకు, ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంతో ఇబ్బందులు ఎదుర్కొన్న నేతలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు సమాచారం. అదే విధంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో వివిధ నియోజకవర్గాల నుంచి అనేక మంది ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించినప్పటికీ లభించలేదు. వీరంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేశారు. అదే విధంగా పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన ద్వితీయ శ్రేణి నాయకులు ఎంతో మంది ఉన్నారు. ఇలాంటి వారంతా నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు.

రాష్ట్రస్థాయి పదవులు దక్కేనా?

పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట్రస్థాయి పదవులు ఎన్ని వస్తాయి అన్నది సందేహంగానే ఉంది. జిల్లాకు సంబంధించి గిరిజన కార్పొరేషన్ సంస్థ చైర్మన్, ట్రైకార్ తదితర చైర్మన్ పదవులు వస్తాయని ఆశావహులు భావిస్తున్నారు. అదే విధంగా కాపు, వెలమ, శిష్టకరణం తదితర కులాలకు చెందిన కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా రాష్ట్రస్థాయిలో ఉన్నాయి. ఇందులో కొన్ని పదవులు లభిస్తాయని కొంతమంది ఆశిస్తున్నారు. అదే విధంగా వివిధ కార్పొరేషన్లకు సంబంధించి డైరెక్టర్ల పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఈ పరిస్థితుల్లో జిల్లాకు ఎన్ని పదవులు కేటాయిస్తారో వేచిచూడాల్సి ఉంది.

జిల్లా స్థాయిలో పదవులు ఎవరికో?

జిల్లా స్థాయిలోనే నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్ల పదవులు కూడా భర్తీకానున్నాయి. ఈ పదవులను నియోజకవర్గ ఎమ్మెల్యేల సిఫారసుల మేరకు అధిష్ఠానం కట్టబెట్టే అవకాశం ఉంది. నాలుగు నియోజకవర్గాలూ రిజర్వ్ నియోజకవర్గాలు కావడంతో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు తోటపల్లి దేవస్థానం తదితర ఆలయాల కమిటీలకు సంబంధించి నామినేటెడ్ పదవులపై ఎంతో మంది బీసీ, తదితర సామాజిక వర్గాల నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవులు ఎవరికి వరిస్తాయో, ఎవరికి ఎంతవరకు న్యాయం జరుగుతుందోనని ఆశావహులు టెన్షన్‌గా ఉన్నారు.

జనసేన, బీజేపీ నాయకులు కూడా..

కూటమి ప్రభుత్వంలో ఉన్న జనసేన, బీజేపీ నాయకులు కూడా నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పొత్తు ఏర్పడక ముందు ఆయా పార్టీల బలోపేతం కోసం ఎవరిస్థాయిలో వారు తమ వంతు ప్రయత్నం చేశారు. ఇలాంటి వారంతా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. దీంతో ఈ రెండు పార్టీల ప్రభావం ఎవరిపైన పడుతుందో తెలియని పరిస్థితి జిల్లాలో ఉంది. వచ్చేది స్థానిక ఎన్నికల కాలం. ఇటువంటి పరిస్థితుల్లో ఓటు బ్యాంకు ఉన్న నాయకులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

శ్రీకాకుళం • శుక్రవారం • 9 ఆగస్టు 2024

cinema@andhrajyothy.com

ఒకప్పుడు అడవులను రక్షించే పాత్రల్లో హీరోలు ఇప్పుడు అటవీ సంపద దోచుకోవడమే హీరోయిజం



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- అల్లు అర్జున్‌ను ఉద్దేశించేనా?

ఒకప్పుడు అడవులను రక్షించే కథాంశాలతో వచ్చిన సినిమాలలో హీరోలు నటించేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు ఉదాహరణగా కన్నడ సినిమా 'గంధదగుడి' చిత్రాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఈనాడు అటవీ సంపదను దోచుకోవడమే హీరోయిజంగా సినిమాలు వస్తున్నాయని ఆయన విచారం వ్యక్తంచేశారు. రీల్‌కు, రియాలిటీకి తేడా ఉంటుందన్నారు. పుష్ప సినిమాలో అడవుల్లోని ఎర్రచందనం కొల్లగొట్టే పాత్రలో హీరో అల్లు అర్జున్ నటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే పవన్‌కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మానవత్వం చూపాల్సిన తరుణం ఇది

ఇటీవల కురిసిన భారీ వర్షాలు కేరళలోని వయనాడ్‌లో విషాదాన్ని మిగిల్చాయి. కొండ చరియలు విరిగి పడడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం కేరళ వెళ్లి నేరుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి విరాళం చెక్కును అందజేశారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మానవత్వం చూపాల్సిన తరుణం ఇది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతుగా కేరళకు సాయం అందించాలి. ఈ దుర్ఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి' అని కోరారు.





నాగచైతన్య శోభిత నిశ్చితార్థం

టాలీవుడ్ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. కొన్నాళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ కథానాయిక శోభితా దూళిపాళ్లతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం ఉదయం హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసి, కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరారు. 'ఈ రోజు ఉదయం మా అబ్బాయి నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఈ మధుర క్షణాలను మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. చాలా సంతోషంగా శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. మీ ఇద్దరూ ప్రేమ, సంతోషంతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున పేర్కొన్నారు. నిశ్చితార్థ వేడుకలో శోభిత ఉప్పాడ పట్టు చీర ధరించగా, నాగచైతన్య పంచెకట్టు, పైన కండువా ధరించి సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. పలువురు సినీ ప్రముఖులు నాగచైతన్య, శోభితకు అభినందనలు తెలిపారు. మరికొద్ది రోజుల్లో వీరి వివాహం జరగనుంది. సమంతతో విడాకులు తీసుకున్నాక నాగచైతన్య శోభితతో ప్రేమలో పడ్డారనీ, ఇద్దరూ తరచూ కలుసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. పలు సందర్భాల్లో నాగచైతన్య, శోభితా జంటగా కనిపించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. కానీ నిశ్చితార్థం వరకూ వారు ఎక్కడా దీనిపై స్పందించలేదు. నాగచైతన్య, శోభిత కలసి ఒక్క సినిమా కూడా చేయలేదు. స్నేహితుల ద్వారా ఇద్దరికీ పరిచయం అయ్యి అది ప్రేమగా మారిందని సమాచారం. చూసేందుకు ఇంటర్నేషనల్ మోడల్‌లా కనిపించే శోభిత తెలుగమ్మాయే. తెనాలిలో జన్మించారు. కొన్నాళ్లు కుటుంబంతో విశాఖలో ఉన్నారు. ముంబైలో ఉన్నత విద్యను అభ్యసించారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 2013 ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ గెలుచుకున్నారు. 2016లో వచ్చిన బాలీవుడ్ చిత్రం 'రామన్ రాఘవన్'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 'గూఢచారి, మేజర్' చిత్రాల్లో నటించారు.

నాడు ప్రేమ ప్రకటన

'ఏ మాయ చేశావే' చిత్రంలో జంటగా నటించిన నాగచైతన్య, సమంత ఏడేళ్ల డేటింగ్ తర్వాత 2017లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2021లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 8న నాగచైతన్యకు తన ప్రేమ ప్రతిపాదన చేశానని సమంత ఓ సందర్భంలో చెప్పారనీ, ఇప్పుడు అదే తేదీన నాగచైతన్య శోభితల నిశ్చితార్థం జరగడం కాకతాళీయమేనా, కావాలనే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. శోభిత హిందీలో 'సితార' చిత్రం చేస్తున్నారు.



ముందస్తు బెయిల్

నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ ఫిర్యాదుపై అతనిపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజ్‌తరుణ్ రెండు వారాల్లో నార్సింగ్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, రూ.20 వేల బాండు, రెండు పూచీకత్తులు ఇవ్వాలని జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం ఆదేశించింది. 8 వారాల పాటు ప్రతి శనివారం పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. మరోవైపు రాజ్‌తరుణ్ స్నేహితుడు శేఖర్ బాషాతో తనకు ప్రాణహాని ఉందని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెట్స్‌లోకి...



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి దశ షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా సెట్స్‌లోకి బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానిస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "పవన్, అనుపమ్ ఖేర్ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయి. అభిమానులకి జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది" అని మేకర్స్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

షెకావత్ సాబ్



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో హీరోతో పాటు కీలక పాత్రలు పోషిస్తున్న ఆర్టిస్టులు పాల్గొనగా పతాక సన్నివేశాలు తీస్తున్నారు. బన్వర్‌సింగ్ షెకావత్‌గా నటిస్తున్న పహాద్ ఫాజిల్ లుక్ పోస్టర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా గురువారం విడుదల చేశారు. గళ్ల లుంగీ, ఒక చేతిలో గన్, మరో చేతిలో గొడ్డలితో పహాద్ కనిపిస్తున్నారు. డిసెంబర్ 6న 'పుష్ప 2' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మిస్తున్నారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక కొణిదెల నిర్మాతగా మారారు. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిహారిక మీడియాతో ముచ్చటించారు. "కథ విన్న వెంటనే ఈ సినిమాలో భాగం అవ్వాలనుకున్నాను. ఒక ఊరిలో జాతర నేపథ్యంలో మూడు తరాలకు చెందిన కథగా దర్శకుడు తెరకెక్కించారు. అందరికీ సినిమా విపరీతంగా నచ్చుతుంది. ఇందులో ఎన్నో క్యారెక్టర్లు ఉన్నా.. ప్రతీ పాత్రకూ విలువ ఉంటుంది. ప్రేక్షకులు ఏదో ఒక పాత్రతో కచ్చితంగా ట్రావెల్ అవుతారు. ఒక నిర్మాతగా ఈ సినిమా నాకెంతో సంతృప్తినిచ్చింది" అని చెప్పారు.

పేదలంటే జగన్‌కు చిన్న చూపు

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు



అన్న క్యాంటిన్ పనులు పరిశీలిస్తున్న కోండ్రు

రాజాం: వైసీపీ అధినేత జగన్‌కు పేదలంటే చిన్న చూపు అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం రాజాం బస్టాండ్‌లో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్‌లను ఎత్తివేసిందని విమర్శించారు. అన్న క్యాంటీన్‌ను ఇక్కడ సెప్టెంబరు నెలలో ప్రారంభిస్తామని కోండ్రు తెలిపారు. ఈ భవనానికి ప్రభుత్వం రూ 20.5 లక్షలు మంజూరు చేసిందన్నారు. అనంతరం రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మూతపడిన షాపులను, మెయిన్ రోడ్డులో చెత్తకుప్పలతో ఉన్న పాత ఆర్ అండ్‌బీ స్థలాన్ని పరిశీ లించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్ రావు, వంగా వెంకటరావు, శాసపు రాజేష్‌కుమార్, టంకాల నాగరాజు, ఉరిటి సురేంద్ర, పొన్నాడ భీమేశ్వరరావు, గురవాన నారా యణరావు, కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ భాగ్యలక్ష్మి, శాసపు రమేష్ కుమార్, టంకాల కన్నంనాయుడు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సోర్స్‌పర్సన్ కోసం గాలిస్తున్నాం

● పార్వతీపురం ఏఎస్పీ సునీల్ శిరోన్ ● వాహనంలో తలిస్తున్న 87 కిలోల గంజాయి స్వాధీనం.. నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న ఏఎస్పీ సునీల్



వాహనం టాప్‌పై అమర్చిన గంజాయి ప్యాకెట్లు

సాలూరు రూరల్, ఆగస్టు 8: బాగువలస వద్ద గంజాయి తరలిస్తూ నిందితుడు బుధవారం పట్టుపడిన విషయం తెలిసిందే. ఈ గంజాయి తరలింపులో సోర్స్‌పర్సన్ కోసం పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు పార్వతీపురం ఏఎస్పీ సునీల్ శిరోన్ తెలిపారు. సాలూరు రూరల్ పోలీసులు పట్టుకున్న గంజాయితో పాటు నిందితుడు బలేస్తర్ సింగ్‌ను గురువారం ఆయన సమక్షంలో పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒడిశా నుంచి బీహార్‌కు బొలెరో వాహనంలో తరలిస్తున్న వాహనాన్ని సాలూరు రూరల్ ఎస్.ఐ వెంకటరమణ, సిబ్బంది పట్టుకున్నారన్నారు. వాహనాన్ని నడుపుతున్న నిందితుడు బలేస్తర్ సింగ్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుబ్లి ప్రాంత పరిధిలో నౌహూర్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు. ఆయనపై పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌డీపీఎస్ కేసు ఉండడంతో నిందితుడు జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడన్నారు. ఒడిశా నుంచి పాచిపెంట మీదుగా వచ్చి సాలూరు మీదుగా వెళ్తున్న సమయంలో సాలూరు రూరల్ ఎస్.ఐ, సిబ్బంది గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని, నిందితుడిని పట్టుకున్నారన్నారు. వాహనం టాప్‌పై పుష్ప సినిమా తరహాలో పెట్టిన 41 ప్యాకెట్లలో 87 కిలోల 290 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుని వద్ద నుంచి సెల్‌ఫోన్, 13 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గంజాయి రవాణాకు మూలకారకుడైన వ్యక్తి కోసం బృందాలు గాలిస్తున్నాయన్నారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు. ఆయనతో సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్.ఐ వెంకటరమణ ఉన్నారు.

జిల్లాలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఒక రోజు పర్యటన నిమిత్తం గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. గతంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న కాలంలో విజయనగరం జిల్లా పోర్టుపోలియో జడ్జిగా పలు మార్లు జిల్లాను సందర్శించారు. జిల్లాకు వచ్చిన జస్టిస్ దేవానంద్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి, పలువురు న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్, కార్యదర్శి సంతోష్, సీనియర్ న్యాయవాది తమ్మన్నశెట్టి, బొడ్డు సత్యనారాయణ, నాలుగెస్సలు రాజు కలిశారు.

ఇళ్లపై జెండాలు ఎగురవేద్దాం

జామి: ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని బీజేపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి దానేష్ అన్నారు. గురువారం జామిలో మండల పార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానేష్ మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 14వరకు అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సమర యోధులు, జాతీయ వీరుల విగ్రహాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. బీజేపీ ప్రతినిధులు పి.వెంకటభాస్కర్, కాపుగంటి వెంకటేష్, కుమారి, ప్రదీప్, చైతన్య, కె.కుమార్, అనిల్ తది తరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల హర్షం

శృంగవరపుకోట: సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి గురువారం శృంగవరపుకోట మండల రేషన్ డీలర్లు క్షీరాభిషేకం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన కలెక్టర్ల సమావేశంలో రేషన్ డీలర్ల పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని చెప్పడం సంతోషంగా ఉందని సంఘ మండల అధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ కొణదం ఉమాశంకరరావు పేర్కొన్నారు. సంఘ సభ్యులు సీహెచ్ అప్పారావు, రాణి, రవి, కుమారి, జగన్నాధం తదితరులు వున్నారు.

పాత కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తెండి

రాజాం: కొత్తగా కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టిన తరువాత పాత ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ జె.రామప్పలనాయుడును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశించారు. గురువారం పాత కాంప్లెక్స్‌ను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన షాపులను, గతంలో ఆర్ అండ్ బీ ఈ డీఈఈ కార్యాలయం ఉన్న ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, వంగా వెంకటరావు, శాసపు రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

బొబ్బిలి రూరల్: పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. పి.డి. నల్ల వెంకటనాయుడు ఆధ్వర్యంలో పోటీలు సాగుతున్నాయి. విజేతలకు ఈ నెల 15న బహుమతులు అందిస్తారు.

ఎరువుల పంపిణీ

వంగర: వంగర, మద్దివలస, సీతారాంపురం, బాగెమ్మపేట తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేలలో గురువారం ఎరువులు పంపిణీ చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పర్యవేక్షణ లేక ...ఎరువులు దొరక్క' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామాల్లోని ఆర్బీకేలకు ఎరువులు సరఫరా చేశారు. రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి కన్నబాబు ఎరువుల షాపులు తనిఖీ చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

వంగర: గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలు గుర్తించి పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని రూపొందించిందని మండల ప్రత్యేకాధికారి సందీప్ అన్నారు. తలగాంలో గురువారం గ్రామదర్శిని కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామంలో సమావేశం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాడంగి: గజరాయనివలసలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తిబాబు, వైస్ సర్పంచ్ కామినాయుడు, ఎంపీటీసీ పాలవలస గౌరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

రాజాం: స్థానిక వస్త్రపురి కాలనీలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. డయేరియా బారిన పడకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు. శానిటరీ ఇన్ స్పెక్టర్ చేగొండి ప్రసాద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రాజుకు ఘన నివాళి



రాజా ఆర్వీజీకే రంగారావుకు నివాళి అర్పిస్తున్న బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 8: బొబ్బిలి రాజా ఆర్‌వీజీకే రంగారావు 98వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు, ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక తారక రామ కాలనీ సమీపంలో గల స్మృతివనం దగ్గరికి బేబీనాయన వెళ్లి రాజా సమాధి దగ్గర సంప్రదాయ సిద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెడ్డి రామమూర్తి, బదరి ప్రసంగించారు. దివంగత రాజా రంగారావుతో ఉన్న గత అనుభవాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మాజీ ఎం.ఎల్.ఎ బొబ్బిలి చిరంజీవులు, స్థానిక టీడీపీ నేతలు పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సత్తి బాబు, ఏగిరెడ్డి శ్రీధర్, కౌన్సిలర్‌లు బొత్స సురేష్, కళ్యంపూడి సత్యనారాయణ, సింగనాపల్లి ఈశ్వరరావు, తెంటు వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల, రాజా ఆర్.ఎస్.ఆర్.కె రంగారావు కళాశాల, శ్వేతాచలపతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో దివంగత రాజా ఆర్వీజీకే రంగారావు వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

● ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

కురుపాం: ఆసుపత్రుల్లో మౌలిక వసతులతో పాటు సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ కోరారు. కురుపాం సీహెచ్‌సీని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది వివరాలు, మౌలిక సదుపాయలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శోభరాణికి అడిగి తెలుసుకున్నారు. మలేరియా కేసులపై ఆరా తీశారు. ఉత్తరాంధ్ర ఐక్యవేదిక నాయకులు ఎం.ప్రదీప్‌కుమార్, పీఎస్ ప్రసాదరావు, గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, పువ్వల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరుగుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ కోరారు. గురువారం జిల్లా ఆసుపత్రిలో ముందుగా వైద్య సేవలకు సంబంధించి రోగులను ఆరా తీశారు. పనులు ఎంత వరకు వచ్చాయో ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవిని అడిగి తెలుసుకున్నారు. పాలకొండ, పార్వతీపురం, సాలూరు ఆసుపత్రులలో రక్త నిధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు.



కురుపాం: సిబ్బందితో మాట్లాడుతున్న అజశర్మ

● **సాలూరు:** వంద పడకల ఆసుపత్రిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక డిమాండ్ చేసింది. ఉత్త రాంధ్ర అధ్యయన వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని గురు వారం పరిశీలించింది. ఆసుపత్రి సూపరెంటెండెంట్ సూర్యకుమారితో మాట్లాడా రు. అనంతరం రోగులతో మాట్లాడి ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అజశర్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేసిందని.. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధి బృందం నాయకులు ప్రదీప్ కుమార్, ప్రసాదరావు, సాలూరు పట్టణ నాయకులు ఈశ్వరరావు, ఎం.శ్రీనువాసరావు, ఎన్.వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

బాడంగి: మండలంలో గల రామలక్ష్మి ట్రేడర్స్, వాసవి ఫెర్టిలైజర్స్‌ను వ్యవసాయాధికారి కె.శిరీష గురువారం తనిఖీ చేశారు. ఎరువుల శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతా ప్రమాణాలు పరిక్షించడానికి ప్రయోగశాలకు పంపించారు. ఆమె వెంట ఏఈవో పుష్పలత ఉన్నారు.

కృత్రిమ అవయవాలకు ఎంపిక

కొత్తవలస: మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టులో గురువారం బరజిలై ఫౌండేషన్, చేతన్ ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించడానికి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈ రెండు ఫౌండేషన్‌లకు చెందిన డి.సీతారామయ్య, షేక్ రషీద్, చంద్రకాంత్ నవీన్ హాజరయ్యారు. 50 మంది దివ్యాంగులకు అవయవాలను అందించడానికి కొలతలను తీసుకున్నారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు మాట్లాడుతూ కొలతలు తీసుకున్న దివ్యాంగులకు త్వరలోనే కృత్రిమ అవయవాలను అందించనున్నట్టు తెలిపారు. వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

రాజాం: సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న న్యాయాధికారి

శృంగవరపుకోట: మత్తుమందు, మాదక ద్రవ్యాల వాడకంతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దని శృంగవరపుకోట జూనియర్ న్యాయాధికారి సబ్బవరపు వాణి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవా సదస్సు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శృంగవరపుకోట మీదగా తరచూ గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు పేర్కొన్నారు. ఏజీపీ అల్లు సత్యాజీ, సీనియర్ న్యాయవాది గేదల ప్రకాష్ తదితరులున్నారు.

న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న న్యాయాధికారి అరుణశ్రీ

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో గురువారం సాయంత్రం సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎ.స.అ.ర.ు.ణ.శ్రీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే వారి కోసం కల్పిస్తున్న హక్కులు, సౌకర్యాలను ఆమె వివరించారు. తొలుత ఆసుపత్రిలో గల రోగుల వార్డులను, ఇతర విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు, ఎంపీడీఓ రవికుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘురాజు వ్యాజ్యంలో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ రఘురాజు దాఖలు చేసిన వ్యాజ్యం గురువారం హైకోర్టు ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న శాసన మండలి సెక్రెటరీ జనరల్, ట్రిబ్యునల్ చైర్మన్, మండలి చైర్మన్, విప్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి, శాసనవ్యవహారాల కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ శాసన మండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ రఘురాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండలి చైర్మన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంటూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు రఘురాజు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయవద్దని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. గురువారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా ధర్మాసనం స్పందిస్తూ... ప్రస్తుతం అధికార పక్షంలోనే ఉన్నారు కదా..? పిటిషన్‌ను ఉపసంహరించుకొని, తిరిగి ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కదా..? అని సరదాగా వ్యాఖ్యానించింది. రఘురాజు న్యాయవాది సార్వభౌమారావు వాదనలు విని పిస్తూ... పిటిషనర్‌పై అనర్హత వేటు వేసే విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదన్నారు. ఈ విషయంలో వాదనలు వినిపిస్తామన్నారు. అనర్హతపై వ్యాజ్యాలను 8 వారాల్లో పరిష్కరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

త్వరలో విద్యార్థి సంఘాల నిరసనకు శ్రీకారం

విజయనగరం దాసన్నపేట: జేఎన్‌టీయూ జీవీలో సమస్యలపై త్వరలో విద్యార్థి సంఘాలు నిరసనకు సిద్ధమౌతున్నాయని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీ నిర్లక్ష్యానికి గురైందన్నారు. యూనివర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బందిని చట్ట వ్యతిరేక బదిలీలు చేశారన్నారు. ఈ చట్ట వ్యతిరేక బదిలీలపై ప్రభుత్వ పెద్దలు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి ప్రతిష్ఠాత్మకంగా జేఎన్‌టీయూ జీవీలో చదువుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

మహిళలు వ్యాపార రంగంలో దూసుకుపోవాలి

విజయనగరం దాసన్నపేట: మహిళలు వృత్తి, నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొంది వ్యాపార రంగంలో దూసుకుపోవాలని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ వి.హరీష్ సూచించారు. జనశిక్షణ సంస్థాన్‌లో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు మూడు రోజుల పాటు జనరేట్ యువర్ బిజినెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్ర మంలో హరీష్ మాట్లాడుతూ శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలతో వ్యాపార రంగంలో ముందుకు పోవాలన్నారు. జన శిక్షణ సంస్థాన్ ప్రతినిధులు కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, గణేష్, రవీంద్ర, ఏపీఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదాన వారోత్సవాలు

విజయనగరం దాసన్నపేట: నగర శివార్లలోని ఆర్‌కే టౌన్‌షిప్‌లో జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవయవ దాన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సంస్థ ప్రతినిధి కె.వెంకట రమణ మాట్లాడారు.

వ్యక్తి ఆత్మహత్య

● ఇటీవలే కుమారుడు మృతి చెందడంతో మనస్తాపం

రామభద్రపురం, ఆగస్టు 8: మండల పరిధిలోని ముచ్చర్లవలస గ్రామంలో రెండు వారాల వ్యవధిలోనే తండ్రీ కొడుకులు ఆత్మహత్య తీవ్ర విషాదం నింపింది. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నడగాన రవణ(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు నడగాన సురేష్(24) గతనెల 24న ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. దీంతో మనస్తాపం చెందిన తండ్రి రమణ గ్రామంలోని పొలంలో బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న రమణను స్థానికులు బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురికి గాయాలు

● ఆరుగురిపై కేసు నమోదు

భామిని: భామిని గ్రామంలో గురువారం జరిగిన దాడి ఘటనలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భామిని గ్రామానికి చెందిన జి.సురేష్ అనే రైతు గురువారం తన పొలంలో మొక్కలు నాటుతున్నాడు. ఇంతలో సరిహద్దు పొలానికి చెందిన కొందరు యాదవులు అక్కడికి వచ్చి, తమ పొలానికి ఆనుకుని ఎందుకు మొక్కలు నాటుతున్నావని దాడికి దిగారు. ఈ విషయాన్ని సురేష్ తమ బంధువులకు సమాచారం అందించారు. సురేష్ బంధువులు అక్కడకు వస్తున్నారని తెలుసుకున్న యాదవులు లివిరి గ్రామ సమీపంలో అడ్డగాసి, కర్రలు, కత్తులతో దాడికి దిగారు. దీంతో జి.లక్ష్మీపతి, జి.రాజు, భూపతిలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని భామిని పీహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రసాద్ గాయపడిన ముగ్గురు వ్యక్తుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. లివిరి గ్రామానికి చెందిన ఆరుగురు యాదవులపై కేసు నమోదు చేశారు.

యువకుడిపై దాడి

పూసపాటిరేగ: మండలంలో రెల్లివలస గ్రామానికి చెందిన పతివాడ షణ్ముఖరావు అనే యువకుడిపై డెంకాడ మండలంలో గల మహంతిపేటకు చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి సుమారుగా 11గంటల ప్రాంతంలో యువకుడు మహంతిపేట వెళ్లగా అక్కడివారు కొందరు ఇతడిపై దాడిచేసి అతిదారుణంగా కొట్టారని తెలిపారు. రాడ్‌లతో కాళ్లు, చేతులపై కొట్టారని, తరువాత మండలంలో పాతకొప్పెర్ల, రెల్లివలస వెళ్లేదారిలో పడేసి వెళ్లిపోయినట్టు తెలిపారు. గాయాలతో బాధితుడు రెల్లివలస చేరగా వైద్యం నిమిత్తం విజయనగరంలో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్చామన్నారు. బాధితుడు ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. దీనిపై స్థానిక ఎస్ఐ సన్యాసిరావును అడుగగా ఇది మహంతిపేటలో జరిగిందని అక్కడే కేసును నమోదు చేస్తారని, తదుపరి దర్యాప్తును నిర్వహిస్తారని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రేగిడి: మండలంలో తునివాడ ఇసుక రేవునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై బుధవారం రాత్రి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. లచ్చరాయపురం వద్ద నిర్వహించిన తనిఖీలో పట్టుబడగా వీటి నిర్వాహకులపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పిన మినీ వ్యాన్

కురుపాం: కురుపాం ప్రదీప్ నగర్ కాలనీ సమీపంలో పార్వ తీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న బోలెరా వాహనం గురు వారం తెల్లవారుజామున రోడ్డు పక్క ఉన్న టిఫిన్ బండిని ఢీ కొని కాలువలో పడింది. వాహ నంలో ఉన్నవారికి ఎటువంటి దె బ్బలు తగలు లేదు. ఘటన జరి గిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఏమి జరగలేదు.

బీసీజీ వ్యాక్సిన్‌ను వినియోగించుకోండి

బొండపల్లి: బొండపల్లి పీహెచ్‌సీ, గొట్లాం వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో భాస్కరరావు గురువారం సందర్శించారు. వయోజనుల బీసీజీ వ్యాక్సిన్ వినియోగంపై ఆయన ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, ఓపీని జాబితాలను పరిశీలించారు. మెడికల్ షాపులను అబా ఐడీతో రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. అనంతరం గొట్లాం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీ లించేందుకు వెళ్లగా రోడ్డుమార్గం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వైద్యాధి కారులు గులిపల్లి ప్రమీళ, ఎల్.సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌ఏ. భాషా, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావులతోపాటు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో మునిసిపల్ ఆర్డీ పర్యటన

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పురపరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు గురువారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, సచివాలయాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి, ప్రగతి పనులపై అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు వెళ్లాలి

నెల్లిమర్ల: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు వెళ్తూ గ్రామాల్లో అభివృద్ధిని సాధించాలని ఎంపీడీవో జి.రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో నిధుల ఖర్చు, అభివృద్ధి ప్రణాళికలు, ప్రణాళికల అమలు తదితర విషయాలు ఉంటాయన్నారు

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

రేగిడి: గ్రామ పంచాయితీల అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కృషి చేయాలని ఈవోఆర్డీ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు వై.హేమసుందరావు, పి.గోపాల్‌నాయుడు, కె.రాజేంద్ర సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● గ్రామ సందర్శనలో ఉన్నతాధికారులు ● జిల్లా వ్యాప్తంగా పర్యటనలు, పరిశీలనలు

ప్రజలకు ప్రభుత్వ అధికారులు జవాబుదారీగా వ్యవహరించి వారి యొక్క సమస్యలు వినడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని పలువురు అధికారులు కోరారు. గురువారం జిల్లా వ్యాప్తంగా గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. స్థానిక అధికారులను ప్రశ్నించి, పలు సూచనలు చేశారు.



బొబ్బిలిరూరల్: నారాయణప్పవలసలో...



రేగిడి: ఖండ్యాంలో..



వేపాడలో..



రామభద్రపురం:తారాపురంలో..



బొబ్బిలిలో..

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా జరిగాయి. కొన్నిచోట్ల ఏకగ్రావం కాగా, కొన్నిచోట్ల చైర్మన్, వైస్ చైర్మన్‌లను తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. మరికొన్ని చోట్ల కోరం లేని కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి.



పాలకొండలో ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ: మండలంలో మొత్తం 59 పాఠశాలలకుగాను 36 ప్రాథమిక పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, నాలుగు పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. యూపీ పాఠశాలల్లో ఏడు ఏక గ్రీవం కాగా, మూడు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఉన్నత పాఠశాలలు 8 ఏక గ్రీవం కాగా, ఒక పాఠశాలకు ఎన్నికలు నిర్వహించారు. ● **వీరఘట్టం:** మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలలకు బొడ్లపాడు మండల ప్రాథమిక పాఠశాలలో కోరం లేని కారణంగా ఎన్నిక వాయిదా పడింది. ● **పార్వతీపురం రూరల్:** మండలంలో మొత్తం 115 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 68 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కాగా, మిగతా పాఠశాలల్లో చైర్మన్‌లను ఎన్నుకున్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం మండలంలోని పాఠశాలల్లో నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ● **కురుపాం:** మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 173 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్టు ఎంఈవో ఎన్.సత్యనారాణ తెలిపారు. ● **జియ్యమ్మవలస:** మండలంలో 96 పాఠశాలలు ఉండగా, 94 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. కోరం లేక పెదబుడ్డిడి, డంగభద్ర గదబవలస ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించలేదు. ● **పార్వతీపురంటౌన్:** ఎస్‌ఎంసీ ఎన్నికల్లో ఎన్డీఏ మద్దతుదారులే చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. పట్టణంలోని 8 ఉన్నత, 13 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ● **సీతంపేట:** మండలంలో 168 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ● **పాచిపెంట:** మండలంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు ఏర్పాట్లు చేశారు. ● **సాలూరు రూరల్:** సాలూరు అర్బన్, రూరల్‌లో పాఠశాలల ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. సాలూరు మండలంలో 150 పాఠశాలలు, పట్టణంలో 23 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. ● **కొమరాడ:** మండలంలో 127 పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ● **కురుపాం రూరల్:** మండలంలోని 174 పాఠశాలలకుగాను ఏకలవ్య పాఠశాల మినహా మిగిలిన 173 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రసాంతంగా ముగిసాయి. ● **మక్కువ:** మండలంలోని 85 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ● **గరుగుబిల్లి:** మండలంలో మొత్తం 55 పాఠశాలల్లో నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించారు. ఉల్లిభద్ర, గరుగుబిల్లి, రావుపల్లి గ్రామాల్లో చిన్నపాటి ఘర్షణల నడుమ ఎన్నికలు ముగిశాయి. ● **భామిని:** మండలంలోని 66 పాఠశాలలకుగాను 64 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తాలాడ, నులకజోడు పాఠశాలలకు కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. ఎన్నిక జరిగిన 64లో 43 పాఠశాలలు ఏకగ్రీవమయ్యాయి.

● పలుచోట్ల ఏకగ్రీవం.. కొన్నిచోట్ల వాయిదా

కోరం లేక వాయిదా

సీతానగరం: మండలంలోని నిడగల్లు ఉన్నత పాఠశాల, అంటిపేట, కొత్తవలస ప్రాథమిక పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో పి.సూరిదేవుడు తెలిపారు. మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలలకుగాను 59 పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నికైనట్లు చెప్పారు. నిడగల్లు ఎన్నికలు సందర్భంగా గందరగోళం పరిస్థితి ఏర్పడటంతో సీఐ రవికుమార్, ఎస్.రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పరిస్థితిని గమనించి ఏఎస్పీ సునీల్ సరైన పాఠశాలకు చేరుకొని ఎన్నికల అధికారికి పలు సూచనలు చేశారు. అంటిపేట, కొత్తవలస పాఠశాలల్లో కమిటీ సభ్యులు ఎన్నిక పూర్తికావడంతో వాయిదా వేశారు. ● బలిజిపేట మండలంలో 56 పాఠశాలలకుగాను 49 పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. కోరం లేకపోవడం, తదితర కారణాల వల్ల అజ్జాడ, చాకరపల్లి, నారయన్నాయుడువలస, గంగాడ, చిలుకలపల్లి, తదితర ఏడు పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి.



కురుపాం: ఆదర్శ పాఠశాలలో ఎన్నికైన ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్



పార్వతీపురంటౌన్: జగన్నాథపురం ఎస్‌ఎంసీ చైర్మన్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు



సీతానగరం: నిడగల్లు పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సునీల్



మక్కువ: ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో వివరాలు నమోదుకు క్యూ కట్టిన తల్లిదండ్రులు

ఏనుగుల సమస్యకు త్వరలో పరిష్కారం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గ ప్రజలు గత కొన్నేళ్లుగా ఏనుగుల సమస్యతో బాధ పడుతున్నారు. గత పదేళ్లుగా ఏనుగుల దాడిలో 12 మంది చనిపోయారు. లక్షలాది రూపాయల విలువైన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలిశారు. ఏనుగుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కుంకి ఏనుగులను పంపించాలనే విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఎన్నడూ పట్టించుకోని ఏనుగుల సమస్యను పవన్‌కల్యాణ్ పరిష్కరించడానికి కృషి చేయడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఈ సమస్యను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. పవన్ కల్యాణ్ నుంచి మంచి స్పందన కనిపించింది.

గిరిజన దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

సాలూరు: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లను గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం పరిశీలించారు. ఆమె ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎగువ బెన్నరాయిలో జ్వరాలు

సీతంపేట రూరల్: కొండాడ పంచాయతీ ఎగువ బెన్నరాయి గ్రామంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు. గ్రామంలో నివసిస్తున్న సవర లక్ష్మి, సవర శివ, సవర సరోజిని, సవర సుందమి జ్వరంతో బాధపడుతూ మంచం పట్టారు. మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఆ గ్రామానికి వెళ్లి జ్వరపీడితులకు మందులు అందజేశారు. అయినా జ్వరాలు జ్వరాలు అదుపులోకి రాలేదు. పూతికవలస గ్రామంలో కూడా పలువురు జ్వరాల బారిన పడ్డారు.

లక్ష్యాల సాధనపై దృష్టి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఆశావహ జిల్లాలో భాగంగా నీతి ఆయోగ్ లక్ష్యం సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం నీతి ఆయోగ్ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ అక్టోబర్ 6వ తేదీ నాటికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బలివాడ సత్యనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సౌకర్యానికి ప్రతిపాదనలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: తోటపల్లి జలాశయం నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా పార్వతీపురం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని 17 మండలాలకు చెందిన సుమారు రూ.1,31,221 ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎస్‌జీఎల్, టీబీటీ డివిజన్-1 కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం మున్సిపాలిటీకి గడిగెడ్డ జలాశయం నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. కొత్త కుడి ప్రధాన కాలువ నుంచి 117.89 కిలోమీటర్ల పొడవున 450 చెరువులకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

అవగాహనతోనే క్యాన్సర్ దూరం

పార్వతీపురం రూరల్: ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి సంబంధించి అవగాహన పెంపొందించుకుంటే క్యాన్సర్‌ను దూరం చేయవచ్చునని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. వెంకమ్మపేటలోని క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం ఆయన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వాడకం, జంక్‌ఫుడ్, కల్తీ ఆహారం, వాయు కాలుష్యం తదితర వాటి వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సింహాచలం, సెక్రటరీ నడిమింటి గోపాల్‌నాయుడు, బి.శంకరరావు, ఎం.చిరంజీవులు, పి.శ్రీరాములు, రెడ్డి గౌడునాయుడు, ఎస్.సీతారాం, డి.వి.రమణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: ఉపాధి వేతనదారుల జాబ్‌కార్డుల నిర్వహణపై దృష్టి సారించాలని ఏపీఎం ఎం.గౌరీనాథ్ సూచించారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారుల జాబ్‌కార్డుల్లో ఎప్పటికప్పుడు హాజరు దినాలను పొందుపర్చాలన్నారు. జాబ్‌కార్డు ఉండీ.. హాజరు కాకుంటే రద్దు చేయాలన్నారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలి

సీతంపేట రూరల్: పాఠశాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన సభ్యులు కృషి చేయాలని సీతంపేట ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు సూచించారు. గురువారం పెద్దూరు ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైన కె.చిట్టెమ్మ, వైస్ చైర్మన్ బి.దివ్యలకు నియామక ప్రతాన్ని అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్.సత్యంనాయుడును గ్రామస్థులు సన్మానించారు.

ప్రతిఒక్కరినీ ఆదుకుంటాం

గరుగుబిల్లి: కష్టంలో ఉన్న విశ్వ బ్రాహ్మణులను సంఘం ఆదుకుంటుందని రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాములూరు హనుమంతరావు, సర్వసిద్ధి ధనుంజయ ఆచారి వెల్లడించారు. ఇటీవల ఏలూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన పెద్దూరుకు చెందిన ముగడ కృష్ణవేణి కుటుంబానికి సంఘం తరపున రూ.90వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణుల సంఘ మహిళా అధ్యక్షురాలు వాసవి, జిల్లా సంఘ అధ్యక్షులు కొమ్మనపల్లి గౌరీశ్వరరావు, అజ్జిరాపు కాశీవిశ్వేశ్వరరావు, ముగడ హరిబాబు, శంబాన వెంకటరమణ, చింతాడ తవిటాచారి, కె.తిరుపతిరావు, కె.కుమార్ పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

మక్కువ: రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని సాలూరు మోటార్ వెహికల్ అధికారి జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహదారి భద్రత అధికారి డాక్టర్ పి.నారాయణరావు, ప్రిన్సిపాల్ పి.వాసుబాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి బుద్ధదేవ్ భట్టాచార్య

సాలూరు: పేదల పక్షపాతి బుద్ధదేవ్ భట్టాచార్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగాల్‌లో సుదీర్ఘ కాలం సీపీఎం పాలనకు వన్నెతెచ్చిన నాయకులలో బుద్ధదేవ్ ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వై.నాయుడు, పట్టణ కమిటీ నాయకులు బి.సంగీత తదితరులు పాల్గొన్నారు.

అడవితల్లికి వందనం

● ఘనంగా ఆదివాసీ దినోత్సవం
● నేడు జిల్లా స్థాయిలో ఉత్సవాలు

పార్వతీపురం/ పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 9న జిల్లా స్థాయిలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ముందుగా జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. గిరిజన మహిళలు బెలగాం కోటదుర్గ ఆలయంలోని అమ్మవారి దగ్గర అడవితల్లి పాలజంగెడకు పూజలు చేశారు. అనంతరం చర్చివీధి కూడలి వద్ద నుంచి ఐటీడీఏ పీవో సేధుమాధవన్‌తో పాటు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గిరిజన యువత నృత్యాల మధ్య ఐటీడీఏలోని అడవితల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అడవితల్లికి నమస్కరించి, క్షీరాభిషేకం చేశారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులతో పీవో, ఎమ్మెల్యే థింసా నృత్యం చేశారు.



అడవి తల్లికి సారె తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే, పీవో

నాపూర్వ జన్మ సుకృతం

జిల్లా ఏర్పడిన తర్వాత ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడవితల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేయడం నా పూర్వజన్మ సుకృతం. వచ్చే ఏడాది ఇంకా ఘనంగా చేసేందుకు నా శాయశక్తుల కృషి చేస్తా.

- సేధు మాధవన్, ఐటీడీఏ పీవో, పార్వతీపురం

నేడు అడవితల్లిని ఆహ్వానించాం

అడవితల్లిని పూజలతో నేడు ఆహ్వానించాం. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రకృతిని రక్షించేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఆదివాసీలకు రుణపడి ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 3ను పునః ప్రారంభించనుంది.

- బోనెల విజయచంద్ర, పార్వతీపురం ఎమ్మెల్యే

పండుగ కాదు.. సమస్యలపై పోరాటం

పార్వతీపురంటౌన్: ఆదివాసీ దినోత్సవమంటే పండుగ కాదని.. వారి సమస్యలపై పోరాట దినమని రైతు కూలీ సంఘ రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ అన్నారు. గురువారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన భవనంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం పేరుతో ప్రభుత్వాలు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పొగడడం, కొందరు రాజకీయ నాయకులకు సన్మానాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికీ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 171 గ్రామాలు నాన్ షెడ్యూల్‌గా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములు భూస్వాములు, పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. గిరిజనుల జీవనాధారమైన భూమి, ఆదివాసీల హక్కులు అందని ద్రాక్షలా మిగిలాయని విచారం వ్యక్తం చేశారు. అనంతరం గిరిజన భవన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘ నాయకులు పి.శ్రీనునాయుడు, ఎం.భాస్కరరావు, కె. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదివాసీ దినోత్సవానికి తరలిరండి

సీతంపేట: సీతంపేట ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో శుక్రవారం జరిగే ఆదివాసీ దినోత్సవానికి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలి రావాలని పాలకొండ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి ఆదివాసీ, దళితుల ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టిందని ఆరోపించారు. జీవో నెంబర్-3పై కనీసం స్పందన లేదన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వంలో ప్రత్యేక స్థానం కల్పిస్తున్నట్టు వివరించారు.

సవర భాషలో ఆహ్వాన పత్రిక

ఐటీడీఏ పరిధిలో సవర తెగ అధికంగా ఉండడం.. ఆ భాషను ప్రోత్సహించాలని పీవోను అక్షరబ్రహ్మ నిర్వాహకులు కోరడంతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఆహ్వానపత్రికను సవర లిపిలో ముద్రించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారిగా సవర లిపికి ఆహ్వాన పత్రికలో చోటు కల్పించడం పట్ల ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీ హక్కులపై చర్చ

కురుపాం: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని గురువారం కురుపాం ఆర్ట్ సంస్థ కార్యాలయంలో ఆదివాసీ హక్కులు, అవకాశాలపై చర్చ నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివాసీ హక్కులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షణ, గిరిజన చట్టాలపై యువత చర్చించారు. ఈ కార్యక్రమంలో రస్తా కుంటుబాయి కన్సల్టెంట్ ఉమాజ్యోతి, ఆర్ట్ సంస్థ ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వర్ణ చిత్రం

గరుగుబిల్లి: ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు చిత్రీకరించిన అడవి తల్లి చిత్రం పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పుస్కరించుకుని నఖ చిత్రాన్ని చిత్రీకరించారు. ఈయన చిత్రీకరించిన పలు నఖ చిత్రాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి.



నాగావళికి వరద ప్రవాహం

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి గురువారం వరద ప్రవాహం చేరింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పైప్రాంతం నుంచి నదిలోకి సుమారు 6,500 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతుంది. కొంతమేర వరద ప్రవాహం చేరడంతో ప్రాజెక్టు అధికారులు స్పిల్‌వే గేట్లు నుంచి దిగువ ప్రాంతాలకు 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.47 మీటర్ల నిల్వ సామర్థ్యం నెలకొంది. అలాగే 2.534 టీఎంసీలకు గాను 2.181 టీఎంసీ నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం 1,290 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువల నుంచి సరఫరా చేస్తున్నారు. అధికంగా వర్షాలు కురిసినట్లయితే పైప్రాంతం నుంచి వరద ప్రవాహం చేరినట్లయితే దిగువకు మళ్లించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ప్రాజెక్టు డీఈ టి.రాఘునాథ నాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిశోర్‌కుమార్‌లు తెలిపారు.



స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు విడుదల చేసిన వరద ప్రవాహం

ఒడిశా

రాయగడ జిల్లాకు కొత్త కలెక్టర్

రాయగడ: రాయగడ జిల్లా కలెక్టర్‌గా పరూల్ శ్రీవాస్తవ్ పట్వారీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 బ్యాచ్‌కు చెందిన ఆమె ఇప్పటి వరకు ఒడిశా స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా భువనేశ్వర్‌లో విధులు నిర్వహించారు. తాజాగా ఇక్కడ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సుందర్‌ఘడ్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్నారు.



కలెక్టర్ పారుల్ శ్రీవాస్తవ్ పట్వారి

76 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: గుణుపురం రైల్వే స్టేషన్ సమీపంలో 76 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం...గుణుపురం ఎస్ఐ రంజిత్ త్రిపాఠి సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా... రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని గుర్తించారు. వారి వద్ద ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న 76 కిలోల గంజాయి, రూ.2వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని... ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితులు బిహార్ రాష్ట్రం భోజ్‌పూర్ అర్రా జిల్లాకు చెందిన మహేంద్ర చౌదురి(58), అభిషేక్ కుమార్ (28)లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

డ్రాపౌట్లను తగ్గించాలి

రాయగడ: పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య తగ్గించాలని జిల్లా న్యాయ విభాగం చైర్మన్ సర్క్యూట్ న్యాయాధికారి సత్యనారాయణ షడంగి ఆదేశించారు. ఈమేరకు స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా న్యాయసేవల అథారిటీ కార్యదర్శి సుబ్రత ఆచార్య అధ్యక్షతన విద్యార్థుల హక్కులపై సమావేశం నిర్వహించారు. మధ్యలో స్కూలు మానివేసి బాలకార్మికులుగా మారుతున్న పిల్లలను మళ్లీ రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బసంత కుమార్ నాయక్, జీసీడీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నమిత ప్రధాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి షడంగి

క్లుప్తంగా..

నేడు పార్వతీపురంలో 'మేము సైతం'

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో శుక్రవారం 'మేము సైతం' కార్యక్రమం ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో రక్తకొరత ఉందని, ప్రత్యేకించి ప్రసవాలు, ప్రమాదాల సమయంలో కొన్ని సమయాల్లో చాలా అసౌకర్యానికి గురవుతున్నామని చెప్పారు. మండలంలో రక్తదాన శిబిరాలను సమన్వయం చేసేందుకు మండల స్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ శోభిక నోడల్ అధికారిగా ఉంటారని చెప్పారు.

షెడ్యూల్...

శుక్రవారం పార్వతీపురంలో, ఈ నెల 12న గుమ్మలక్ష్మీపురంలో, 26న కురుపాంలో, సెప్టెంబరు 5న పాలకొండలో, 15న సీతంపేట, 28న పాచిపెంట, అక్టోబరు 2న వీరఘట్టం, 12న జియ్యమ్మవలస, 22న సీతానగరం, నవంబరు 2న బలిజిపేట, 14న సాలూరు, 26న భామిని, డిసెంబరు 1న మక్కువ, 10న కొమరాడ, 24న గరుగుబిల్లిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

పీటీజీ బాలికల జూనియర్ కళాశాలలో పెరిగిన సీట్లు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి పీటీజీ బాలికల జూనియర్ కళాశాలలో సీట్ల సంఖ్య పెరిగినట్టు ప్రిన్సిపాల్ ఏ.సత్యవతి తెలిపారు. ఒక్కొక్క గ్రూప్‌నకు పది చొప్పున సీట్లు పెరిగాయన్నారు. ఈ పెరిగిన సీట్లకు ఈనెల 13న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం పది గంటల్లోపు తమ కళాశాలకు రావాలన్నారు. ఎంపీసీ పది, బైపీసీ పది, హెచ్‌ఈసీ పది చొప్పున సీట్ల సంఖ్య పెంచినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

మద్యం ధ్వంసం

మక్కువ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన సారా 647 లీటర్లు, 155 లీటర్ల మద్యాన్ని చెముడు రహదారి సమీపంలో ఏఎస్పీ పి.సునీల్ సోరెన్ పర్యవేక్షణలో గురువారం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నరసింహమూర్తి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

పార్వతీపురంటౌన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పార్వతీపురం ఎక్సైజ్ ఎస్ఐ పద్మావతి అన్నారు. గురువారం కొత్తవలస శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు, తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతికుమారి, న్యాయవాది జోగారావు, ఎన్‌సీసీ అధికారి గుప్తా పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

పాలకొండ: ఇసుక అక్రమ రవాణా జరిగితే ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ఆర్డీవో వీవీ రమణ హెచ్చరించారు. గురువారం గోపాలపురం ఇసుక ర్యాంప్‌ను మైన్స్ అధికారులతో కలిసి పరిశీలించారు ర్యాంప్‌లో ఎవరైనా అ క్రమంగా ఇసుక తరలించినా, వారికి సహ కరించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.